# సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023






## వరుణ జపహోమం

సింహాచలం: వర్షాలు సమృద్ధిగా కురవాలని నాలుగు రోజులుగా నిర్వహించిన వరుణ జపహోమం గురువారం ముగిసింది.



## పార్కుల ఆధునికీకరణ

విశాఖ: తూర్పు నియోజకవర్గ పరిధిలో ఆధునికీకరించిన పార్కులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పరిశీలించారు.



## తోడపెద్దుకు పెద్దకర్మ

విశాఖ: శివాజీపాలెంలో ఇటీవల మరణించిన బుద్దల చిన్నయ్య సేవగరిడి ఎద్దుకు గురువారం పెద్దకర్మ నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### అడ్డు వస్తే అలర్ట్ చేసే స్టిక్

- అంధుల కోసం రూపొందించిన ఇంజినీరింగ్ విద్యార్థులు



ఈసీ ప్రాజెక్టు ఇంజినీర్ శేషగిరిరావుతో విద్యార్థులు

**అనకాపల్లి టౌన్:** స్థానిక డైట్ కళాశాల ఈసీఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు అంధుల కోసం ప్రమాదాన్ని గుర్తించే స్టిక్‌ను తయారుచేశారు. ఈ పరికరాన్ని రూపొందించిన కళాశాల విద్యార్థులు ఎస్.మహేష్, ఎం.మేఘన, జి.ఝాన్సీలు మాట్లాడుతూ దీనిని తయారు చేయడానికి రూ.300లు ఖర్చవుతుందని చెప్పారు. అంధులు వెళ్లేటప్పుడు ఏదైనా అడ్డు వస్తే ఈ పరికరం శబ్దంతో అప్రమత్తం చేస్తుందన్నారు. సెన్సార్, స్టిక్, బజర్, ఎల్ఈడీ బల్బ్, ఓల్ట్స్ పవర్ సప్లయ్, ఆన్ ఆఫ్ స్విచ్ ఉపయోగించినట్లు విద్యార్థులు తెలిపారు. ప్రాజెక్టు ఇంజినీర్ బి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

### కార్మికునికి పరిహారం

**అచ్యుతాపురం (అనకాపల్లి):** అచ్యుతాపురం సెజ్‌లో అస్వస్థతకు గురై మృతి చెందిన అభిజిత్ కార్మికుడు సత్యారావు కుటుంబానికి పరిహారం చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించింది. మడుతూరుకు చెందిన సత్యారావు మృతి చెందడంతో కుటుంబసభ్యులు చేపట్టిన ఆందోళనలకు యాజమాన్యం స్పందించింది. మండలానికి చెందిన నేతలు జరిపిన చర్చల్లో మృతుని కుటుంబానికి పది లక్షల ఇరవై ఐదు వేల రూపాయల పరిహారం అందించేందుకు సంస్థ ముందుకు రావటంతో సమస్య పరిష్కారమయింది.

### స్టాఫ్ నర్సు పోస్టులకు కౌన్సెలింగ్

**మహారాణిపేట:** స్టాఫ్ నర్సు పోస్టులకు ఎంపికైన వారికి గురువారం రెండో విడత కౌన్సిలింగ్ నిర్వహించారు. మొత్తం 86 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. తొలి విడత నవంబర్ 7న కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఇచ్చారు. విజయనగరం మెడికల్ కాలేజీలో 80 పోస్టులు, వైద్య విధాన పరిషత్‌లో ఆరు పోస్టులకు ఎంపిక చేశారు. 52 పోస్టులు భర్తీ చేశారు. రెండో విడతలో 34 పోస్టుల కోసం అభ్యర్థులను పిలిచారు. రెండు పోస్టులకు అర్హత గల అభ్యర్థులు లేరు. రెండు పోస్టులకు అభ్యర్థులు హాజరు కాలేదు. ఐదుగురు అభ్యర్థులు పోస్టుల భర్తీలో అన్‌విల్లింగ్ చూపించారని వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ బి.సుజాత తెలిపారు. ఇందులో రెండు పోస్టులు మన్యం జిల్లా పీహెచ్‌సీల్లో భర్తీ చేశామన్నారు. 21 మందిని విజయనగరంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ కోసం భర్తీ చేశామన్నారు. మిగిలిన పోస్టులు త్వరలో భర్తీ చేస్తామన్నారు. దీనిపై క్లారిఫికేషన్ కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తున్నామని ఆర్డీ సుజాత తెలిపారు.

### ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు గడువు ఈనెల 31

**దొండపర్తి:** ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఒకసారి ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజును ఎటువంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబర్ 31వ తేదీలోగా చెల్లించాలని డీఈవో చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి వారు ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.100, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.150, ప్రాక్టికల్ ఒక్కో దానికి రూ.100 చొప్పున చెల్లించాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులుకాని విద్యార్థులు ఉత్తీర్ణత పొందిన థియరీ సబ్జెక్ట్ ఇంప్రూవ్‌మెంట్(ఈ సదుపాయం ఐదేళ్ల కాలంలో ఒక్కసారి మాత్రమే వినియోగించుకొనే అవకాశం) కోసం రూ.250, ప్రాక్టికల్‌కు రూ.100 ఫీజు చెల్లించాలని వెల్లడించారు. ఈ ఫీజులను ఏపీటీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌లో లేదా గేట్‌వే పేమెంట్ ద్వారా చెల్లించాలని చెప్పారు. ఇతర వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని తెలిపారు.

### వీసీ సమతకు అభినందన



ఆచార్య సమతను అభినందిస్తున్న జీఎఫ్‌ఏ సభ్యులు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ఆచార్య కె.సమతను గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. తమను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ పద్మజ, డాక్టర్ దాస్, డాక్టర్ నాయుడు, డాక్టర్ దేవానంద్, తదితరులు పాల్గొన్నారు.

# 20 నిమిషాల్లో రిజిస్ట్రేషన్






- కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంటేషన్
- స్లాట్ బుకింగ్.. అనంతరం రిజిస్ట్రేషన్
- ఈ ప్రక్రియ పూర్తవగానే ఆటో మ్యుటేషన్
- ఆధార్ లింకింగ్‌తో తప్పుడు రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట
- జిల్లాలో అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి..

**సాక్షి, అనకాపల్లి:** రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులభతరమయింది. ఇప్పటికే సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం.. అక్రమాలకు చెక్ పెడుతూ కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానం ద్వారా పలు రకాల ప్రయోజనాలు పొందే వెసులుబాటు కలుగుతుంది. ఇది సురక్షితమైనదే కాకుండా ఎటువంటి సాంకేతిక సమస్యలకు అవకాశం ఉండదని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత విధానంలో డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడంవంటివన్నీ రిజిస్ట్రేషన్ల శాఖతో సంబంధం లేకుండా బయట జరుగుతున్నాయి. ఆ ప్రక్రియ పూర్తయ్యాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇదో పెద్ద ప్రహసనం. కార్డ్ ప్రైమ్ విధానంలో చాలా తక్కువ సమయంలో సులభంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తవుతుంది. బయోమెట్రిక్ ద్వారా వేలిముద్ర వేయడానికి కేవలం 5 నుంచి 10 నిమిషాలు సరిపోతుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బయట జరిగే పనిని సులభంగా ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. పబ్లిక్ డేటా ఎంట్రీ ఇంటిగ్రేషన్ ద్వారా వినియోగదారులే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకునేలా ఈ కొత్త విధానం రూపొందించారు. జిల్లాలో ఉన్న 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ డాక్యుమెంటేషన్ శరవేగంగా జరుగుతోంది నవంబర్ 5వ తేదీన జిల్లాలో కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకూ 4,303 డాక్యుమెంట్లు రిజిస్టర్ చేశారు.

**20 నిమిషాల వ్యవధిలోనే..**

రిజిస్ట్రేషన్‌కు అవసరమైన డాక్యుమెంట్లపై అవగాహన లేక దస్తావేజు లేఖర్లను ఆశ్రయించాల్సి వచ్చేది. డాక్యుమెంట్లను తయారు చేయించుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందజేస్తే అక్కడి సిబ్బంది డేటా ఎంట్రీ, స్కానింగ్ చేసి రిజిస్ట్రేషన్ చేసేవారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ప్రజలు పడిగాపులు పడాల్సి వస్తోంది. నూతన విధానంలో స్లాట్ బుకింగ్ చేసుకుంటే.. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ 20 నిమిషాల వ్యవధిలోనే పూర్తవుతుంది. ఆధార్ లింక్‌తో తప్పుడు రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట పడుతుంది. ఆస్తి వివరాలు, పేరు, ఆధార్, సాక్షులు వంటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే వెంటనే ఆస్తి మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీలు ఎంత కట్టాలో చూపిస్తుంది. ఆ సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించొచ్చు. ఆఫ్‌లైన్, స్టాక్‌హోల్డింగ్ ద్వారా కూడా చలానా కట్టొచ్చు. అనంతరం రిజిస్ట్రేషన్‌కి టైమ్ స్లాట్ బుక్ చేసుకోవాలి. ఆ సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేదా గ్రామ/వార్డు సచివాలయానికి వెళితే అక్కడ అప్లికేషన్‌లో నమోదు చేసిన ఆధార్ వివరాలను సరిచూస్తారు. బయోమెట్రిక్ ద్వారా వినియోగదారుని వేలిముద్ర తీసుకుంటారు.

### ఈ-సైన్‌తో పని పూర్తి

ఇదంతా అయిన తర్వాత ఆ ఆస్తిని సబ్ డివిజన్ చేయాల్సి వస్తే వెంటనే చేస్తారు. పాత విధానంలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక దాన్ని రెవెన్యూ శాఖలో సబ్ డివిజన్ చేయించడం ఓ పెద్ద ప్రహసనం. కార్డ్ ప్రైమ్‌లో రిజిస్ట్రేషన్ సమయంలోనే సబ్ డివిజన్ (అవసరమైతే) పూర్తవుతుంది. వ్యవసాయ భూములైతే మ్యుటేషన్ కూడా ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. దానికోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. రెవెన్యూ రికార్డుల్లో పేరు కూడా వెంటనే మారిపోతుంది. ఇందుకోసం కార్డ్ 2.0ని రెవెన్యూ శాఖ వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్‌కి అనుసంధానం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను ప్రింట్ తీసి ఇస్తారు. గతంలో మాదిరిగా స్టాంప్ పేపర్ల అవసరం ఉండదు. వినియోగదారుడు కోరుకుంటే స్టాంప్ పేపర్లపై ప్రింట్ ఇస్తారు. ఈ విధానంలో వినియోగదారుడు ఎక్కడా సంతకం పెట్టాల్సిన అవసరం ఉండదు. ఈ-సైన్‌తోనే పని పూర్తవుతుంది.

### సులభం.. పారదర్శకం



కార్డ్ ప్రైమ్ ద్వారా రిజిస్ట్రేషన్ల విధానం మరింత సులభమవుతుంది. మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్లు చాలా తక్కువ సమయంలో సులభంగా, పారదర్శకంగా జరుగుతాయి. అవకతవకలకు ఆస్కారం ఉండదు. అంతా ఆన్‌లైన్ కావడం వల్ల సమయం ఆదా అవుతుంది. ఓటీపీ పంపడం వల్ల మోసపూరిత రిజిస్ట్రేషన్లు తగ్గిపోతాయి. ఎవరి అవసరం లేకుండా ప్రజలు నేరుగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చు. అనకాపల్లి జిల్లాలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రజల ఉపయోగార్థం నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు కూడా అందుబాటులోకి తీసుకొచ్చాం. వీటిని ప్రజలు విరివిగా ఉపయోగిస్తున్నారు.

– జానకీదేవి, జిల్లా రిజిస్ట్రార్

## జగనన్న పాలనలో గ్రామ స్వరాజ్యం

- గాంధీజీ కలలు సాకారం
- ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ
- నూతన భవనాలు ప్రారంభం



జెడ్.కొత్తపట్నంలో నిర్మించిన ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ

**రావికమతం:** గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ఆచరణలో పెట్టి చూపించారని ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అన్నారు. జెడ్.కొత్తపట్నం గ్రామంలో రూ.కోటి 10 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ఆర్బీకే భవనం, హెల్త్ క్లినిక్, సచివాలయ భవనాలను, చీమలపాడు గ్రామంలో కల్యాణపులోవ రిజర్వాయర్ కాలువపై మరమ్మతులు చేపట్టిన అక్విడెక్ట్‌ను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామ స్వరాజ్యం సాధిస్తేనే దేశ ప్రగతి సాధ్యమని గాంధీజీ కన్న కలలను ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అక్షరాలా అమలు చేస్తున్నారన్నారు. సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఆర్బీకేలతో గ్రామాల్లో గణనీయమైన మార్పు కనిపిస్తోందన్నారు. ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ జగన్నాథరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ, సర్పంచ్‌లు వితంశెట్టి లక్ష్మి, ఒంజరి గంగరాజు పాల్గొన్నారు.

వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం 8లో

## జగనన్న వన్స్‌మోర్



మళ్లీ జగనన్న సీఎం కావాలంటూ ప్రచారథం



గణేష్ చేపట్టిన పాదయాత్రను అడ్డురోడ్డులో ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

- అడ్డురోడ్డు నుంచి తిరుమలకు పాదయాత్ర
- జిల్లా యువకుడి యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే బాబూరావు

**నక్కపల్లి:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ జగన్‌మెహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలంటూ జిల్లాకు చెందిన యువకుడు అడ్డురోడ్డు నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టాడు. ఈ పాదయాత్రను గురువారం అడ్డురోడ్డు జంక్షన్‌లో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే జిల్లాలోని రావికమతం మండలం జెడ్ కొత్తపట్నం గ్రామానికి చెందిన గాలి గణేష్ ఏయూ పూర్వ విద్యార్థి. వైఎస్ కుటుంబానికి విధేయుడు. గతంలో ఐదు పర్యాయాలు వైఎస్సార్ అమరజ్యోగి స్టూడెంట్ ఫోర్స్ పేరిట విశాఖ నుంచి ఇడుపులపాయకు పాదయాత్ర చేశాడు. ఇపుడు వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలంటూ పాదయాత్రకు ప్రారంభించాడు. పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ గణేష్‌కు వైఎస్ కుటుంబంపై ఉన్న అభిమానానికి చేతులెత్తి నమస్కరిస్తున్నానన్నారు. దాదాపు 800 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం సాహసోపేతమన్నారు. పాదయాత్రికుడు గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్ పాలన రాష్ట్రంలో స్వర్ణయుగం లాంటిదన్నారు. వైఎస్సార్ జీవించి ఉంటే రాష్ట్ర విభజన జరిగేది కాదన్నారు. ఆయన తనయుడిగా జగనన్న మరింత గొప్పగా సుపరి పాలన అందిస్తున్నారని కొనియాడారు.

నవరత్నాల పేరిట పార్టీలకతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. తనతోపాటు మరో పది మంది పాదయాత్రలో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, కె.నీలేంద్రరావు, మైలారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమంతో భారత వికాసం



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖాధికారి రాహుల్ మాలిక్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ

- కేంద్ర పథకాలపై అవగాహనకు సంకల్ప యాత్ర
- కేంద్ర హోంశాఖ అధికారి రాహుల్ మాలిక్

**తుమ్మపాల:** జిల్లాలో ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల పూర్తి అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అధికారి రాహుల్ మాలిక్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం యాత్ర నిర్వహణపై ఆయనతో పాటు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్‌మాలిక్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికై కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కొనసాగుతున్న పథకాలపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను దృశ్య, శ్రవణ మాధ్యమాల ద్వారా ఈ యాత్రలో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పట్టణాలకు దూరంగా ఉంటున్న గిరిజనులు ఈ పథకాలను వినియోగించుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. యాత్రలో భాగంగా మెడికల్ క్యాంపు, డ్రోన్ ప్రదర్శన ఉంటుందన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలోని గిరిజనులు నివసిస్తున్న ఆరు మండలాల్లో యాత్ర నిర్వహించాలని సూచించారు. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ కేవీ మురళీకృష్ణ, డీఆర్వో బి.దయానిధి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, కేఆర్‌సీసీ ఎస్‌డీసీ ఎ.మహేష్, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, పీపీవో జి.రామారావు, వ్యవసాయ శాఖ జేడీ మోహన్‌రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## స్కై మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

**ఆనందపురం :** మండలంలోని శొంఠ్యాం ఉన్నత పాఠశాలలో స్కైమార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు గురువారం ఎంపిక కార్యక్రమం జరిగింది. అండర్-14, 17, 19 విభాగాలలో పోటీలు నిర్వహించగా విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల నుంచి 210 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేయగా వారు ఈ నెల 11,12 తేదీల్లో పాడేరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారితో పాటు గోవాలో జరిగిన 37 నేషనల్ గేమ్‌లో రాష్ట్రం నుంచి పాల్గొన్న పోతిన ప్రవీణ్, జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన రామవరం క్రీడాకారిణి యర్రసిరి, రన్నింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిన శొంఠ్యాం క్రీడాకారిణి కె.ఉదయశ్రీని నాయకులు, ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు లెంక రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సీనియర్ నాయకుడు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.అప్పలరాము, టీమ్ మేనేజర్ గవర ఈశ్వరరావు, గుడిలోవ దేవస్థానం చైర్మన్ కోరాడ గిరిరాజు, కోరాడ వెంకటరమణారావు, గొలగాని కృష్ణ, గొలజాన రవి, షిణగం రాంబాబు, కోళ్ల అప్పలస్వామి పాల్గొన్నారు.

అర్హత ఉంటే ఉద్యోగం 8లో

## కిసాన్ డ్రోన్స్ డెమో ప్రారంభం



కిసాన్ డ్రోన్స్ యంత్రం డెమోను ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

**మాడుగుల:** పంటలకు డ్రోన్స్ సహాయంతో పురుగుల మందులు పిచికారీ చేయడానికి వ్యవసాయశాఖ రాయితీపై అందించే కిసాన్ డ్రోన్స్ యంత్రం పనితీరును కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పరిశీలించారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొనడానికి బుధవారం వీరనారాయణం గ్రామానికి వచ్చిన కలెక్టర్ రైతుల సమక్షంలో డెమోను ప్రారంభించి, దీని వలన ఉపయోగాలను వివరించారు. ప్రభుత్వం అందించే రాయితీ వివరాలను వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈఓ. ఎం.పోలినాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. పీఎం కిసాన్, పీఎం ఉజ్వల, ఆయుష్మాన్ భారత్, మరో 10 పథకాలు కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో అమలవుతున్నాయన్నారు. అర్హత ఉండి ఇంకా పథకాలు అందకపోతే వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం 429 మంది లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందజేశారు.

**మాడుగుల హల్వాకు అంతర్జాతీయ గుర్తింపు!**

ఉద్యానవనశాఖాధికారి భానుపుష్ప లీలావతి మాట్లాడుతూ.. పీఎం ఎఫ్ఎంఈ పథకంలో భాగంగా ఈ ప్రాంతం ప్రత్యేకత మాడుగుల హల్వాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి కృషి జరుగుతుందన్నారు. గుర్తింపు రాగానే ఒక్కొక్క తయారీదారుడికి రూ.53 లక్షలు రుణంగా అందజేస్తారన్నారు. ఆత్రేయపురం పూతరేకులకు ఎలా గుర్తింపు వచ్చిందో అలాగే మాడుగుల హల్వాకు త్వరలో గుర్తింపు వస్తుందని వివరించారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్ బాగున్నాయని పీడీ కె.అనంతలక్ష్మి, సీడీపీవో శ్రీదేవిలను కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి అభినందించారు. జేసీ జాహ్నవి, వికసిత్ భారత్ జిల్లా అబ్జర్వర్ రాహుల్ మాలిక్, నాబార్డు డీడీఎం సమంత్‌కుమార్, డీసీసీబీ సీఈవో శ్రీనివాస్, ఎంపీడీవో మీనాకుమారి, డీజీఎం ఎల్.అప్పలరాజు, సహకార సంఘ అధ్యక్షుడు విస్సారపు రామారావు, సంఘ కార్యదర్శి సత్తిబాబు, మండల స్థాయి అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు నక్కపల్లి విద్యార్థులు

- అరటి దవ్వ భూసారానికి ఉపయోగపడేలా ప్రాజెక్టు తయారీ



ప్రశంసా పత్రాలతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**నక్కపల్లి:** ఇటీవల నిర్వహించిన సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో నక్కపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో కుంచం నరేష్, హెచ్ఎం రాణిలలితలు గురువారం తెలిపారు. అరటి దవ్వ పొడిని ఉపయోగించి భూసారాన్ని పెంచడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యమన్నారు. సైన్స్ టీచర్ జి.సుమబిందు పర్యవేక్షణలో విద్యార్థులు జయవర్ధన్, జయదుర్గ, నానాజీలు ఈ ప్రాజెక్టును గురువారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించారు. ప్రథమ స్థానంలో నిలిచి పతకం, సర్టిఫికెట్‌లు సాధించారు. ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు ఈ ప్రాజెక్టును జాతీయ స్థాయికి ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని ఆకాంక్షించారు. ఇందుకు కారణమైన విద్యార్థులను, టీచర్‌ను అభినందించారు. నక్కపల్లి స్కూల్ నుంచి జాతీయ స్థాయికి ప్రాజెక్టు ఎంపిక కావడం పట్ల జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ నానాజీ, పేరెంట్స్ కమిటీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, చైర్మన్ పద్మ తదితరులు అభినందనలు తెలిపారు.

## క్లుప్తంగా

### కన్నుల పండువలా శృంగార వల్లభస్వామి కల్యాణం



స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**పాయకరావుపేట:** దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా శ్రీ శృంగార వల్లభస్వామి వారి దివ్యకల్యాణం గురువారం సాయంత్రం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణ, మంగళ వాయిద్యాల నడుమ శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో వైభవోపేతంగా ఈ కళ్యాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కల్యాణం అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఈస్వామి వారి దివ్య కల్యాణంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అధినేత నరసింహారావు, రామసీత దంపతులు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సమీరా దంపతులతో పాటుగా తుని, పాయకరావుపేటకి చెందిన పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

**సీతంపేట:** గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల గృహిణులు ఇనిస్టిట్యూట్‌కి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8019388999 నంబరుకు సంప్రదించాలన్నారు.

# 5న వడ్డాదిలో సాధికార బస్సు యాత్ర

- భారీస్థాయిలో విజయవంతం చేయాలి
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

**బుచ్చెయ్యపేట :** ఈ నెల 5వ తేదీన బుచ్చెయ్యపేట మండలం మేజర్ పంచాయతీ వడ్డాది నాలుగురోడ్ల జంక్షన్‌లో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్ర బహిరంగ సభను కార్యకర్తలు విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. గురువారం చిన అప్పనపాలెంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు మామిడి తోటలో బుచ్చెయ్యపేట మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ధర్మశ్రీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అందరికీ సామాజిక న్యాయం చేశారన్నారు. ఇప్పటికే రెండు విడతలుగా జరిగిన బస్సుయాత్ర విజయవంతం కాగా మూడో విడతలో వడ్డాది విచ్చేస్తున్న సాధికార బస్సుయాత్రకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. 23 ఏళ్ల కిందట దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రజాప్రస్థానం పాదయాత్ర చేసిన ప్రదేశంలోనే ఇపుడు సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఆనాడు అధిక సంఖ్యలో తరలివచ్చి అత్యధిక మెజార్టీతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని గెలిపించినట్టే ఐదోవ తేదీన జరిగే సాధికార బస్సు యాత్రకు నియోజకవర్గంలో 40 వేల మందికి పైగా ప్రజలు తరలివచ్చి రెండోసారి ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఐదోవ తేదీ ఉదయం 10 గంటలకు రోలుగుంటలో బస్సుయాత్రకు వచ్చిన మంత్రులతో విలేకర్ల సమావేశం నిర్వహించి యాత్ర ప్రారంభిస్తారని, రావికమతం మండలం కొత్తకోట స్కూల్లో నాడు-నేడు పనులు పరిశీలించి మధ్యాహ్నం బుచ్చెయ్యపేట మండలం కొమళ్లపూడి వద్ద భోజనాలు చేసి సాయింత్రం ఎల్‌బీ పురం వద్ద నియోజకవర్గంలో రూ.158 కోట్లతో చేస్తున్న జల్‌జీవన్ మిషన్ ఇంటింటి కుళాయి పనులు ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 3 గంటలకు వడ్డాది నాలుగురోడ్ల జంక్షన్ సినిమాహాలు వద్ద భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల శేషు, డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నియోజకవర్గ సలహాదారుడు ఎస్ఎస్ఎన్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి జోగా కొండబాబు పాల్గొన్నారు.



చిన అప్పనపాలెంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

# వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి



టీడీపీ కౌన్సిలర్ల విమర్శలను తిప్పికొడుతున్న వైస్ చైర్మన్ అప్పలనాయుడు

- జనసేన కౌన్సిలర్ తీరుపై చైర్‌పర్సన్ అసహనం

**నర్సీపట్నం :** అజెండా చదవడం పూర్తయిన తర్వాతే సమస్యలపై మాట్లాడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి సభ్యులకు సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. సభ ప్రారంభం కాగానే జనసేన కౌన్సిలర్ సౌజన్య కల్పించుకొని కౌన్సిల్‌లో తీర్మానం చేసిన అంశాన్ని రద్దు చేసే అధికారం అధికారులకు ఉంటుందని ప్రశ్నించారు. చైర్‌పర్సన్ కల్పించుకుని అజెండా పూర్తవ్వకుండానే మధ్యలో మాట్లాడడం సరికాదన్నారు. దీంతో జనసేన కౌన్సిలర్ సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. వీధిలైట్ల, శానిటేషన్ నిర్వహణ అధ్వానంగా ఉందని టీడీపీ కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి ప్రస్తావించారు. మున్సిపాలిటీలో మొత్తం 3700 వీధిలైట్లు ఉండగా, పది లైట్లు మాత్రమే వెలగలేదని, మొత్తం లైట్లు పని చేయడం లేదనడం సరికాదని, కౌన్సిలర్లు కమిటీగా వస్తే ఎక్కడెక్కడ లైట్లు పని చేస్తున్నాయో చూపిస్తానని ఏఈ రవికుమార్ బదులిచ్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ తమరాన అప్పలనాయుడు కల్పించుకుని 2014లో అధికారంలో టీడీపీ ప్రభుత్వమే వీధిలైట్ల నిర్వహణను ప్రైవేట్ సంస్థకు అప్పగించడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందన్న విషయాన్ని పద్మావతి గ్రహించాలన్నారు.

పంచాయతీగా ఉన్నప్పుడు డ్రైనేజీ వ్యవస్థ తప్ప 40 ఏళ్ల అధికారంలో మీరేమైనా అభివృద్ధి చేశారా..అని వైస్‌చైర్మన్ కౌన్సిలర్ పద్మావతిని ప్రశ్నించారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో మెయిన్‌రోడ్డుతో పాటు వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. అభివృద్ధిపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని వైస్‌చైర్మన్ పేర్కొన్నారు. దీంతో కౌన్సిలర్ పద్మావతి, వైస్‌చైర్మన్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ సమావేశంలో కమిషనర్ రవిబాబు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రేమించి మోసగించిన వ్యక్తిపై ఫిర్యాదు

**రోలుగుంట :** తనను ప్రేమించి మోసగించిన వ్యక్తిపై ఓ యువతి అందించిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. కె.నాయుడుపాలెం గ్రామానికి చెందిన గుములూరి ప్రసాద్(24) పంచాయతీ శివారు అంట్లపాలేనికి చెందిన ఓ యువతి నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ప్రసాద్ ఉద్యోగరీత్యా రామగుండంలో ఉంటున్నాడు. యువతి నర్సీపట్నంలో ఓ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో పని చేస్తోంది. ప్రసాద్ గ్రామానికి వచ్చినపుడు ప్రేమికులిద్దరూ కలుసుకునేవారు. ఈ నేపథ్యంలో ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి శారీరకంగా లోబరుచుకున్నాడు.

ఆనక పెళ్లికి నిరాకరించాడు. విషయం పెద్దల వరకూ వెళ్లగా వారి సమక్షంలో కూడా ససేమిరా అన్నాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి ప్రసాద్‌ని కస్టడీలోకి తీసుకున్నారు.

## 3న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

**యలమంచిలి(అనకాపల్లి రూరల్):** స్వర్గీయ ఘంటసాల వెంకటేశ్వర్రావు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 3వ తేదీన యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం పక్కనున్న ఘంటసాల కళామందిరంలో రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహించనున్నట్టు స్థానిక ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడారి పూరి జగన్నాథం, కార్యదర్శి ఇవటూరి సాంబశివరావు గురువారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలవారు పురుషులైతే గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర్రావు పాడిన పాటలు, మహిళలైతే ఘంటసాల సంగీత సారథ్యం వహించినపాటలు మాత్రమే పాడాలని సూచించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 9494920254, 9866307171 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వారు తెలిపారు.

# లింగ వివక్షను విడనాడాలి



ఉగ్గినపాలెంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళలు





స్వయం సహాయక సంఘాల మహిళలు వేసిన రంగవల్లులు

**కశింకోట :** లింగ వివక్షకు వ్యతిరేకంగా ఉగ్గినపాలెంలో స్వయం సహాయక సంఘాల మహిళలు గురువారం ప్రదర్శన నిర్వహించారు. జాతీయ స్థాయి లింగ వివక్ష ప్రచారోద్యమంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు ఆధ్వర్యంలో మహిళలు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. లింగ వివక్ష చూపబోమంటూ మహిళలు ప్రతిజ్ఞ చేశారు. వెలుగు ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, వీవోఏలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నరసింగబిల్లిలో కూడా లింగ వివక్షకు వ్యతిరేకంగా స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రదర్శన నిర్వహించి ముగ్గులు వేశారు. సర్పంచ్ కోన అరుణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోన నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## మహారాష్ట్ర టూరిజం రోడ్‌షోకు స్పందన

**మత్రిపాలెం:** మహారాష్ట్ర పర్యాటకశాఖ నిర్వహిస్తున్న టూరిజం ట్రావెల్ అండ్ ట్రేడ్ రోడ్‌షోలకు మంచి స్పందన లభిస్తోందని ఆ శాఖ డెప్యూటీ డైరెక్టర్ మధుమిత సర్‌దేశాయ్ వెల్లడించారు. మత్రిపాలెంలో గల హోటల్ మేరియట్‌లో గురువారం జరిగిన రోడ్‌షోలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని 8 నగరాలలో రోడ్‌షోలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహారాష్ట్రలో అంతర్రాష్ట్ర ప్రయాణాలు, పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నామన్నారు. విశాఖలో కూడా తమ రోడ్‌షోలకు మంచి స్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. తమ రాష్ట్రంలోని జ్యోతిర్లింగాలు, ఫండర్‌పూర్, కొల్హాపూర్ వంటి పుణ్యక్షేత్రాలకు భక్తులు అధికసంఖ్యలో వస్తారని తెలిపారు. మహారాష్ట్ర అందించే అపారమైన టూరిజం, ట్రావెల్, టూరిజం ల్యాండ్‌స్కేప్‌ను తెలియజేయడానికి వన్‌స్టాప్ షాప్‌గా ఉంటాయన్నారు. చారిత్రక వారసత్వం, బీచ్‌లు, మతపరమైన చిహ్నాలు, హిల్‌స్టేషన్లు, వన్యప్రాణులు, సాహస క్రీడలు, రుచికరమైన వంటకాలు, సాంస్కృతిక ఉత్సవాలు, రవాణా కనెక్టివిటీతో మహారాష్ట్ర దేశంలోనే ప్రముఖ పర్యాటక ప్రదేశాలలో ఒకటిగా పేరుగాంచిందని గుర్తు చేశారు. విశాఖలోని టూర్-ట్రావెల్‌రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

## డ్వాక్రా నిధుల గోల్‌మాల్‌పై ఫిర్యాదు

**మాకవరపాలెం:** పక్కదారి పట్టిన డ్వాక్రా సంఘ సభ్యుల నిధులపై విచారణ చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. మండలంలోని రాచపల్లి గ్రామంలోని డ్వాక్రా సంఘ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాల పంపిణీలో వీవోఏ వసూళ్లకు పాల్పడుతున్నట్టు గ్రామానికి చెందిన పెదపాత్రుని రాజేశ్వరి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో పసుపు కుంకుమ నగదు కూడా కొందరు సభ్యులకు ఇప్పటికీ అందలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం సొమ్మును కూడా సభ్యుల ఖాతాల్లో జమ చేయలేదని ఆరోపించారు. ఈ విషయమై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 'స్పందన'లో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

# విశాఖ ఉక్కు, ప్రత్యేక హోదా తెలుగు వారి హక్కు

- 'ఉక్కు సత్యాగ్రహం' చిత్ర నిర్మాత సత్యారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిత్ర నిర్మాత పి.సత్యారెడ్డి

**పాయకరావుపేట :** విశాఖ ఉక్కు - ప్రత్యేక హోదా - తెలుగు వారి హక్కు అని ఉక్కు సత్యాగ్రహం చిత్ర నిర్మాత పి.సత్యారెడ్డి అన్నారు. తెలుగుసేన ఆధ్వర్యంలో జనం ఎంటర్‌టైన్‌మెంట్ పతాకం నిర్మిస్తున్న ఉక్కు సత్యాగ్రహం చిత్రం ప్రచార రథం గురువారం పట్టణం చేరుకుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత, డైరెక్టర్, కథా నాయకుడు పి.సత్యారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్మించిన ఈ చిత్రం ప్రచార యాత్ర చేపడుతున్నట్టు తెలిపారు. ప్రజాకవి గద్దర్ చివరిసారిగా ఈ సినిమాలో నటించారన్నారు. అదే విధంగా గద్దర్ కుమార్తె డాక్టర్ వెన్నెల, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మ శ్రీ, విశాఖ ఎంపీ కూడా ఈ చిత్రంలో నటించడం జరిగిందన్నారు. ప్రచార రథాన్ని ప్రారంభించి ఈ నెల 24న హైదరాబాద్‌లో యాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వరకు రథయాత్ర చేసి, అక్కడ ఉద్యమకారుల సభలో ప్రసంగించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ రెండో వారంలో ఈ చిత్రం విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికుల హక్కుల్ని కాపాడడం కోసం రూపొందించిన ఈ చిత్రంను అందరూ ఆదరించాలని కోరారు.

**అనకాపల్లిలో చిత్రబృందం**

**అనకాపల్లిటౌన్ :** విశాఖ ఉక్కుసత్యాగ్రహ సినిమా చిత్రబృందం బస్సుయాత్ర గురువారం స్థానిక రింగ్‌రోడ్డుకు చేరుకుంది. ఈ సందర్భంగా సినిమా నిర్మాత, దర్శకుడు, నటుడు పి.సత్యారెడ్డి మాట్లాడుతూ ఈనెల 24న ప్రారంభమైన బస్సుయాత్ర 15 జిల్లాల్లో తిరుగుతూ అనకాపల్లి పట్టణానికి చేరుకుందని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం 32 మంది ప్రాణత్యాగాల కారణంగా ఏర్పడిందని, వేలాది మంది రైతులు స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి భూములు ఇచ్చారని తెలిపారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 2న రిలీజ్ చేయడం జరుగుతుందన్నారు. ముందుగా విశాఖ ఆర్‌కెబీచ్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్రదర్శిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గద్దర్ కుమార్తె వెన్నెల, శిలపరశెట్టి శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు.



# అర్హత ఉంటే ఉద్యోగం

- 70 కంపెనీలు 7వేల మందికి ఉపాధే ధ్యేయంగా జాబ్‌మేళా
- నేడు,రేపు నిర్వహణ
- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో..





మాట్లాడుతున్న ఆడారి ఆనంధ్‌కుమార్

**మల్కాపురం :** పారిశ్రామికవాడ నిరుద్యోగులకు శుభవార్త. ఏపీ సూక్ష్మ చిన్నమధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంధ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం, శనివారాల్లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. అర్హత ఉంటే చాటు ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్ తదితర రంగాల్లో సుమారు 7వేల ఉద్యోగాలను ఒకే వేదికపై కల్పించనున్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఆడారి ఆనంద్‌కుమార్ ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మెగా జాబ్ ఫేర్‌ను పురస్కరించుకుని 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా గల అండాలమ్మ కళాశాల వద్ద గురువారం ఆడారి ఆనంధ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో యువతకు ఉపాధి కల్పించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో నిరుద్యోగులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించామన్నారు. నియోజకవర్గంలో ఎక్కువ పరిశ్రమలున్నాయని, అయితే స్థానికులకు అక్కడ ఉపాధి లభించడం లేదన్న విషయాన్ని నిరుద్యోగులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ విషయంపై నాలుగు నెలల నుంచి పార్టీ రాష్ట్ర సలహాదారుడు మిలీనిమం శ్రీధర్‌రెడ్డితో చర్చించి ఇక్కడ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించేలా మెగా జాబ్‌మేళాకు శ్రీకారం చుట్టామన్నారు. గోపాలపట్నంలోగానీ పారిశ్రామికవాడలో మరోమారు జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. మిలీనియం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఇదో గొప్ప అవకాశమని, ఈ మెగా జాబ్‌మేళాలో 70 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. సుమారు 5 నుంచి 7 వేల మందికి ఉపాధి లభించడం ఖాయమన్నారు. వివరాలకు 9000818467, 9000938467 నంబర్లలో సంప్రదించాలన్నారు. 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా గల అండాలమ్మ కళాశాల్లో శుక్ర,శనివారాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రినాథ్, కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహ్మాన్, పారిశ్రామిక ప్రాంత ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్, పలు వార్డుల కార్పొరేటర్లు పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు పాల్గొన్నారు.

# కణుజు మాంసంతో ముగ్గురు అరెస్టు



కణుజు మాంసం నిందితులతో అటవీ సిబ్బంది

**నర్సీపట్నం :** కణుజు మాంసం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని జిల్లా అటవీ అధికారి కె.లక్ష్మణ్ తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందిని అప్రమత్తం చేయడంతో మాకవరపాలెం మండలం, ఎరకన్నపాలెం గ్రామ సమీపంలో నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జె.ప్రశాంతి, సెక్షన్ ఆఫీసర్ జి.వి.నూకరాజు, బీట్ ఆఫీసర్ ఈ నెల 29న సాయంత్రం దాడులు నిర్వహించారన్నారు. చినరాచపల్లికి చెందిన చింతల సత్తిబాబు, ఎరకన్నపాలేనికి చెందిన పూడి రమణను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 11 కేజీల కణుజు మాంసంను తమ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. పట్టుబడిన వారు ఇచ్చిన సమాచారం మేరకు కణుజును వధించిన చినరాచపల్లికి చెందిన చింతల రమణను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ ముగ్గురు నిందితులపై వన్యప్రాణుల రక్షణ చట్టం-1972 కింద పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు. నిందితులను జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని జిల్లా అటవీ అధికారి తెలిపారు.

## పలు ప్రత్యేక రైళ్లు

**తాటిచెట్లపాలెం:** ప్రయాణికుల సౌకర్యార్థం రద్దీ మార్గాల్లో వయా దువ్వాడ మీదుగా పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి ప్రకటనలో తెలిపారు.

- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(06073) స్పెషల్ రైలు చెన్నై సెంట్రల్‌లో ఈ నెల 4,11,18, 25వ తేదీల్లో (సోమవారం) రాత్రి 11.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 11.20గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 6.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ భువనేశ్వర్‌లో ఈనెల 5,12,19,26 తేదీల్లో (మంగళవారం) రాత్రి 9 గంటలకు బయల్దేరి తెల్లవారు 3.45 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 3.50 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 3 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.
- సంబల్‌పూర్-కోయంబత్తూర్(08311) వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారాలలో సంబల్‌పూర్‌లో ఉదయం 10.55 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 8.45 గంటలకు బయల్దేరి మరుసటిరోజు గురువారం రాత్రి 9.50 గంటలకు ఈరోడ్‌కు చేరుకుంటుంది. ఈ రైలు ఈనెల 6వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కోయంబత్తూర్-ఈరోడ్(08312) వీక్లీ స్పెషల్ ఈరోడ్‌లో ప్రతీ శుక్రవారం మధ్యహ్నం 12 గంటలకు బయల్దేరి మరుసటిరోజు శనివారం మధ్యాహ్నం 12.08 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 12.10 గంటలకు బయల్దేరి శనివారం రాత్రి 9.15 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ రైలు ఈనెల 8వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు నడుస్తుంది.

## క్లుప్తంగా

### శివాలయాలకు భక్తుల తాకిడి



లక్ష బిల్వార్చనలో భక్తులు

**అనకాపల్లిటౌన్ :** పట్టణంలోని శివాలయాల్లో గురువారం శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర సందర్భంగా బిల్వార్చనలు, అభిషేకాలు జరిగాయి. స్థానిక గౌరీపంచాయతన దేవాలయంలో లక్ష బిల్వార్చన జరిగింది. స్వామివారి దర్శనానికి భక్తులు బారులుతీరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, కమిటీ సభ్యులు పెంటకోట బాలకృష్ణ, ఏఎల్ఆర్ నర్సింగరావు, ఉమామహేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, గౌరీగీతా మహిళా మండలి సభ్యులు, ఎల్లపు రమణ, విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

### లోఓల్టేజీ సమస్యతో ఇక్కట్లు



ఈఈ రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న దాడి రత్నాకర్

**కశింకోట :** విద్యుత్ లో–ఓల్టేజీ సమస్య నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ కోరారు. కశింకోటలోని ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఈఈ ఎస్. రామకృష్ణను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి మండలంలోని పాపయ్యసంతపాలెం గ్రామంలో కొంత కాలంగా లో–ఓల్టేజీ సమస్య ఉండటం వల్ల గ్రామాల్లో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఈఈ రామకృష్ణ హామీ ఇచ్చారు. రైతులు మొల్లేటి సత్తిబాబు, సియాద్రి వెంకట అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోయిలాడ నాగు పాల్గొన్నారు.

### లింగ వివక్షపై అవగాహన ర్యాలీ

**సబ్బవరం:** మండల కేంద్రం సబ్బవరంలో లింగ వివక్షపై వెలుగు సిబ్బంది, మహిళలు గురువారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సీసీ జయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష, అసమానతలను తొలగించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం బాల బాలికలను సమానంగా చూసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

## బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 3,067 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| స్పెషల్ రకం | 4,050 | 4,490 |
| మొదటి రకం | 3,920 | 4,400 |
| రెండో రకం | 3,740 | 4,130 |
| మూడో రకం | 3,510 | 3,730 |

## అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| ఆదికేశవ | : రాజా |
| కాలింగ్ సహస్ర | : సత్యనారాయణస్క్రీన్-1 |
| విక్రమ్ రాథోడ్ | : సత్యనారాయణస్క్రీన్-2 |
| యానిమల్ | : షిర్డిసాయి |
| కోటబొమ్మాళి | : పర్తిసాయి |
| ------- | : వెంకటేశ్వర |
| సౌండ్ పార్టీ | : శ్రీసత్య |
| మంగళవారం | : రామచంద్ర |

## రక్త నిల్వలు

**అనకాపల్లిటౌన్ :** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 18 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్–1 యూనిట్, 'బి' పాజిటివ్–3 యూనిట్లు, 'ఒ' పాజిటివ్–10 యూనిట్లు, 'ఎబి' పాజిటివ్–4 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (97036 19706) నంబరులో సంప్రదింవచ్చు.

## గ్యాస్ సమాచారం

**అనకాపల్లిటౌన్ :** ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 382 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



గవరపాలెం పరమేశ్వరి పార్కు వ్యాయామశాలలో ఊయల ఊగుతున్న చిన్నారులు

**నాడు** గతంలో వ్యాయామం చేయాలంటే ప్రైవేటు జిమ్‌లను ఆశ్రయించి వెలనెలా వందలాది రూపాయల ఫీజు చెల్లించాల్సి వచ్చేది. మధ్య తరగతి వారికి వ్యాయామం చేసే యోగ్యత ఉండేది కాదు. ఎక్కడా ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు గానీ.. అటువంటి ఆలోచన గానీ ఎవరికీ వచ్చేది కాదు.

**నేడు** వ్యాయామం చేయాలంటే ఎక్కడికో వెళ్లాల్సిన పరిస్థితి నుంచి పట్టణంలో మూడు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం జీవీఎంసీ ఆధ్వర్యంలో విస్తృతంగా వ్యాయామ శాలలు నిర్మించింది. దీంతో చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యాన్ని పదిలం చేసుకుంటున్నారు

# ఆహ్లాదం ఆరోగ్యం

**పార్కులు ఆహ్లాదానికి.. ఆరోగ్యానికి బెంచ్ మార్కులు. పార్కులు లేని కాలనీల**ను ఊహించలేం. అటువంటి పార్కుల్లో పిల్లలు ఆడుకు**నేందుకు పలు** రకాల ఆట వస్తువులతో పాటు పెద్దలు వ్యాయామం **చేసేందుకు** పరికరాలు, వాకర్లకు వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు **చేసి ఆహ్లాదం**.. ఆరోగ్యం ఒకేసారి అందిస్తోంది జగనన్న ప్రభుత్వం.

- పెద్ద ఎత్తున ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యం సమకూరుతుందంటున్న ప్రజలు
- ప్రభుత్వ పనితీరు పట్ల సర్వత్రా హర్షం

**అనకాపల్లిటౌన్ :** పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యాయామ శాలలకు యువత, 50 సంవత్సరాలలోపు స్త్రీ, పురుషులు పరుగులు తీస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో తెల్లవారి లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు ఉరుకులు, పరుగులతో ఒత్తిడికి లోనవుతున్నారు. దీని నుంచి బయట పడేందుకు స్త్రీ, పురుషులు ప్రస్తుతం వ్యాయామ శాలలకు క్యూ కడుతున్నారు. తద్వారా మానసిక ప్రశాంతత పొంది, ఒత్తిడి నుంచి బయటపడుతున్నారు. ప్రైవేటు జిమ్‌లకు వెళ్లాలంటే ఆర్థిక భారం కావడంతో అటు చూడటం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం ఓపెన్ జిమ్‌లను రూపొందిస్తోంది. ఇక్కడ జనం ఉదయం, సాయంత్రం ఉత్సాహంగా వ్యాయామం చేసుకుంటున్నారు.

- విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన జీవీఎంసీ అధికారులు రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంత మహిళలు, చిన్నారులు, యువత, పెద్దలు జిమ్‌లోని పరికరాలతో వ్యాయామం చేస్తున్నారు. తమకు ఆనందంతో పాటు ఆరోగ్యం సొంతమవుతుందని ఇక్కడికి వచ్చే వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- గుండాలవీధి కూడలిలో జీవీఎంసీ అధికారులు రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు. ఈ పార్కుకు నిత్యం వందలాది మంది వాకర్స్ వస్తుంటారు. వారంతా గతంలో ఇంటి వద్ద వ్యాయామం చేసుకునేవారు. ప్రస్తుతం ఈ పార్కులో ఉన్న పరికరాలతో వ్యాయామం చేస్తూ ప్రభుత్వ సేవలను ఉపయోగించుకుంటున్నారు.



గవరపాలెం పరమేశ్వరి పార్కు వ్యాయామశాలలో జిమ్ పరికరాలు

- గవరపాలెం సంతబయలు వద్ద రూ.5 లక్షలతో జీవీఎంసీ అధికారులు ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ మహిళలతో పాటు పెద్దలు, యువత ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం, వాకింగ్ చేస్తూ అనారోగ్య సమస్యలకు దూరంగా ఉంటున్నారు.
- గవరపాలెం పరమేశ్వరి పార్కులో జీవీఎంసీ అధికారులు రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ వాకర్స్ వాకింగ్ చేసుకోవడంతో పలు రకాల వ్యాయామాలు చేస్తున్నారు. యువత పెద్ద సంఖ్యలో పార్కుకు చేరుకుని శరీర దారుఢ్యాన్ని పెంచుకుంటున్నారు. అటు మహిళలు సాయంత్రం వేళల్లో జిమ్‌కు చేరుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.



విజయరామరాజుపేట ఓపెన్ జిమ్‌లో చిన్నారులు




- **కోట్నివీధిలో** రూ.3 లక్షలతో జీవీఎంసీ అధికారులు **వ్యాయామశాల**ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాం**తంలో నివసిస్తు**న్న యువత ఎప్పుడెప్పుడు ప్రభుత్వం **వ్యాయామశాల**ను అందుబాటులోకి తీసుకొస్తుందా **అని ఎంతో ఆ**సక్తిగా ఎదురు చూస్తున్నారు.

### ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు ఇలా..

- విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి పక్కన రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- గుండాలవీధి కూడలిలో రూ.5 లక్షలతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు
- గవరపాలెం సంతబయలు వద్ద రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- గవరపాలెం పరమేశ్వరి పార్కులో రూ.5 లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు
- పట్టణంలోని కోట్నివీధిలో రూ.3 లక్షల వ్యయంతో వ్యాయామశాల ఏర్పాటుకు చర్యలు

### దగ్గు తగ్గుముఖం పట్టింది..



గతంలో ఆయాసంతో పాటు విపరీతంగా దగ్గు వచ్చేది. ఇటీవల విజయరామరాజుపేటలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేయడం ద్వారా ఆయాసం, దగ్గు తగ్గుముఖం పట్టాయి. దీంతో ఆందోళన తగ్గింది.

– షేక్ ఫరీద్, వేల్పులవీధి, అనకాపల్లి

### ఫిట్‌నెస్ పెరిగింది..



ఫిట్‌నెస్ కోసం వ్యాయామ శాలకు వెళ్లాలని అనుకున్నా. ప్రైవేటు జిమ్‌లకు వెళ్లి ఫీజు చెల్లించుకునే స్తోమత లేకపోవడంతో గుండాలవీధిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు వెళ్తున్నా. ఇటీవల నా ఫిట్‌నెస్ పెరిగింది. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి బాగుంది.

– ఎ.సురేష్, లక్ష్మీదేవిపేట, అనకాపల్లి

### వాకింగ్‌కు వీలుగా ఉంది..



విజయరామరాజుపేట ఓపెన్ జిమ్‌లో వాకింగ్ చేయడానికి వీలుగా ఉంది. ప్రభుత్వం ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయక ముందు రోడ్డుపై వాకింగ్ చేసేవాడిని. రోడ్డు ప్రమాదాలకు గురవుతానేమోనని భయంగా ఉండేది. ప్రస్తుతం జిమ్‌లో ఏ భయం లేకుండా ఎక్కువ సమయం నడుస్తున్నాను.

– కేవీ గౌరీపతి, నర్సింగరావుపేట, అనకాపల్లి

## సీఎం చొరవతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

**అనకాపల్లిటౌన్ :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ప్రభుత్వ బడులు కార్పొరేట్ స్కూళ్లగా మారాయని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. మండలంలో మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఎటువంటి లోటు లేకుండా అన్ని వసతులు, మంచి విద్యాబోధన కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరణం శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు మిద్దే రామచంద్రరావు, పార్టీ నేతలు ముత్తుర్తి నాగేశ్వరరావు, పి.రాజుబాబు, ఇమంది శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బేతా ప్రవీణ్‌కుమార్, కరణం సత్యవతి, బొడ్డపాటి చిన రాజారావు, ఇంటి త్రినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న రత్నాకర్

## నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

**అనకాపల్లిటౌన్ :** ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని పట్టణంలోని సచివాలయం–13 బాలాజీనగర్, కూండ్రం గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, ఎంపీపీ గొర్లి సూరిబాబు గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పై కార్యక్రమాలకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని వారు తెలిపారు.

**జి. భీమవరంలో**

**కశింకోట :** మండలంలోని జి. భీమవరం సచివాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి. రవికుమార్ తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

## సంఘ సంస్కర్త గురజాడ

**కశింకోట :** ప్రజా కవి, ప్రముఖ సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు వర్ధంతి స్థానిక బాలికల హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం.ఎస్. స్వర్ణకుమారి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి గురజాడ అప్పారావు కన్యాశుల్కం, కన్యక, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ వంటి రచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు శివాజీ, ఉపాధ్యాయులు శకుంతల, కల్పన, అనిత, కాళిదాసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గురజాడ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

## ఘనంగా మరిడిమాంబ పండగ

**తుమ్మపాల :** అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో శ్రీ మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. గ్రామ ప్రజలు, భక్తులు తెల్లవారి నుంచి ఆలయానికి చేరుకుని పసుపు కుంకుమలతో అమ్మవారికి పూజలు చేశారు. అనవాయితీగా వస్తున్న ఆచారంగా గృహాల నుంచి డప్పులు, డోలక్కులతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వచ్చి అగ్నిగుండాలపై నడిచి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. గురువారం సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించి భక్తులు ఉపారాన్ని అమ్మవారికి సమర్పించారు.

## భోగలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

**అనకాపల్లిటౌన్ :** గవరపాలెం కోటవీధి భోగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు దంపతులతో పాటు మరో 19 జంటలు అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కొణతాల కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, కాండ్రేగుల రాము, కొణతాల అప్పాజీ, త్రినాథరావు, సింగంపల్లి రాజేశ్వరి నాగరాజు, మెలిపాక దుర్గ ఈశ్వరరావు పాల్గొన్నారు.



స్వామివారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

## సీఎం జగన్‌తోనే సంక్షేమం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



ఈ.చౌడువాడలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న బొడ్డేడ ప్రసాద్

**అనకాపల్లిటౌన్ :** రాష్ట్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో బుధవారం రాత్రి ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీయిస్తున్నా, బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నా అది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్లేనన్నారు. అంతకుముందు సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన మంచి చూసి జగన్‌కు ఓటు వేయాలని కోరారు. ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, పార్టీ నేత కాండ్రేగుల విష్ణుమూర్తి, సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, ఆలయ చైర్మన్లు కె.ఎం.నాయుడు, ఆళ్ల నాగేశ్వరరావు, సకలా గోవింద, మాజీ కౌన్సిలర్లు దాడి భోగలింగం, నడిశెట్టి మధు, విల్లూరి శివసూరి, వేగి త్రినాథ్, పార్టీ నేతలు బుద్ద రాజు, పలకా సత్యనారాయణ, అల్లు త్రినాథ్, సమ్మంగి కనకారావు, బెల్లాన అనురాధ, ఈగల మహేష్, కరణం సురేష్, చింతల రాము పాల్గొన్నారు.

**నెయ్యిలవీధిలో..**

అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించిన ఘనత జగన్‌కే దక్కిందని పార్టీ పట్టణ అధ్యక్షుడు, జోన్ జేసీఎస్ కన్వీనర్ మందపాటి జానకీరామరాజు అన్నారు. పట్టణ పరిధిలోని సచివాలయం–12 నెయ్యిలవీధిలో గురువారం ఏపీకీ జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ అధ్యక్షతన జరిగింది. అంతకు ముందు సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి ఇంటింటికీ బ్రోచర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జెడ్పీ ఎస్.వెంకటరమణ, సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ నేతలు ముమ్మిన పైడిరాజు, గాడి సుజాత, విల్లూరి శివసూరి, పలకా సత్యనారాయణ, నాగులాపల్లి పేర్రాజు, వెంకటేష్, శేషు, కోన ఉమ, డొంక సత్తిబాబు, పేలురి కల్యాణ్, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

**ఈ.చౌడువాడలో..**

**కశింకోట :** పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మండలంలోని ఈ.చౌడువాడ (కన్నూరుపాలెం) సచివాలయంలో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు ప్రజలకు అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వాటర్ వేస్ సంస్థ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్ ఎస్. శివ, వైఎస్సార్‌సీపీ యలమంచిలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రొంగలి జగన్నాథరావు, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు కన్నూరు అచ్చియ్యమ్మ, ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఈవోఆర్‌డీ సోమరాజు, ఎస్. సత్యారావు, ప్రజలు పాల్గొన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న జానకీరామరాజు, మురళీకృష్ణ, రమేష్, రాఘవ



కుంచంగిలో మాట్లాడుతున్న దంతులూరి దిలీప్ కుమార్

**వైఎస్సార్‌సీపీతోనే పేదలకు న్యాయం..**

**అనకాపల్లి రూరల్ :** గురువారం సాయంత్రం మండలంలోని కుంచంగి సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ఏపీ ఇన్లాండ్ వాటర్ వేస్ అథారిటీస్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవిందు, గ్రామ సర్పంచ్ పల్లెల నాగలక్ష్మి, పల్లెల నాగేశ్వర్రావు, బొడ్డు దేముడుబాబు, పెతకంశెట్టి శివసత్యనారాయణ జోసెఫ్, మరిపల్లి శోభ, పద్మకుమారి, లక్ష్మి, రొంగలివానిపాలెం సర్పంచ్ రొంగలి నాయుడు, వార్డు మెంబర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

### కేజే పురంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**మాడుగుల రూరల్:** జన జాతీయ గౌరవ్ దివస్, వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం కె.జె.పురం 2వ సచివాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను స్థానిక ఎంపీడీవో పీఎస్ఎల్‌వీ మీనా కుమారి వివరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్ పథకంతో గ్రామంలో రూ.3.30 కోట్లు వెచ్చించి, ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన సర్పంచ్ జామి రమణబాబు మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, లోవతల్లితో పాటు స్థానిక పీఏసీఎస్ అధ్యక్షులు కాళ్ల రాము, మళ్ల కన్నబాబు, ఆడారి కన్నారావు, ఎం.వి.సత్యనారాయణ, వివిధ శాఖల అధికార్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### దళితుల సమస్యలు పరిష్కరించాలి

**కశింకోట :** దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన గ్రామసభలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కనక మహాలక్ష్మి వీధి ప్రాంతంలో ఉన్న శ్మశాన వాటికలో కొంత భాగం ఆక్రమణకు గురై కుంచించుకుపోయిందని, ఆక్రమణలు తొలగించి హద్దులు నిర్ణయించాలని కోరారు. ఇందిరా కాలనీలో స్థలానికి హద్దులు వేయలేదని, రెల్లి వీధిలో ఇంటింటి కుళాయిలు ఉన్నా నీరు రావడం లేదని ఫిర్యాదు చేశారు. దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, అదనపు ఎస్ఐ జె. నాగేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్, పంచాయతీ కార్యదర్శి ఎస్. రమేష్, ఆర్ఐడీ ప్రతినిధి శ్రీకన్య, దళిత నాయకులు రమణ, సత్యారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

### జగనన్న స్వచ్ఛ సంకల్పాన్ని నెరవేర్చాలి

**దేవరాపల్లి:** జగనన్న స్వచ్ఛ సంకల్పం ఆశయాన్ని నెరవేర్చేందుకు ప్రజలు సహకరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు అన్నారు. దేవరాపల్లి సచివాలయంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మతో కలిసి స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా సరఫరా చేసిన తడి, పొడి చెత్త సేకరణ బుట్టలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో తడి, పొడి చెత్తను వేరు చేసి సిబ్బందికి అందించాలని కోరారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, కోఆపరేటివ్ డైరెక్టర్ వరదపురెడ్డి లలితానాయుడు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న కిలపర్తి భాస్కరరావు

### దుర్గాలమ్మకు ప్రత్యేక పూజలు రేపు

**మాడుగుల రూరల్:** కె.జె.పురం గ్రామంలో దుర్గాలమ్మకు శనివారం పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పొలమరశెట్టి చిట్టినాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామ ప్రజలు హాజరై అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.